సోమవారం 08-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 388, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



**పెట్రోల్ బంకుల్లో పెట్రోల్‌కు బదులుగా నీళ్లు**

వివరాలు 3లో



**995 కోట్ల పాస్‌వర్డ్‌లు లీక్**

వివరాలు 3లో



**బీర్, వైన్, విస్కీ బరువును ఎలా పెంచుతాయో తెలుసా...!**

వివరాలు 4లో



**మీ విజన్‌కు ధన్యవాదాలు.. పార్ట్ 2 కోసం వెయిటింగ్..**


వివరాలు 5లో

## ఆన్‌లైన్ రుణాలపై కేంద్రం హెచ్చరిక

- క్యాష్‌ఎక్స్‌పాండ్-యూ పేరుతో నకిలీ యాప్
- ఫోన్లలో వెంటనే తొలగించాలని సూచన

ముందడుగు జాతీయం:
ఆన్‌లైన్ రుణాలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి హెచ్చరించింది. 'క్యాష్‌ఎక్స్‌పాండ్-యూ' పేరిట ఆన్‌లైన్‌లో రుణాలు అందించే యాప్ నకిలీదేనని పేర్కొంది. అంతేకాకుండా ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి తొలగించామని, యూజర్లు కూడా ఫోన్లలో వెంటనే తొలగించాలని సూచించింది.

"CashExpand-U Finance Assistant-లోన్ యాప్‌పై జాగ్రత్త. ఇది నకిలీది. దీని మూలాలు శత్రు దేశంలో ఉన్నట్లు తెలిసింది" అని పేర్కొంటూ ప్రభుత్వ సైబర్ క్రైమ్ విభాగం సైబర్ దోస్త్ వెల్లడించింది. ఈ యాప్‌ను తక్షణమే ఫోన్ల నుంచి తీసివేయాలని, తద్వారా కీలక




సమాచారం దుర్వినియోగం కాకుండా చూసుకోవచ్చని తెలిపింది.

స్వల్ప రుణాలు ఇస్తామంటూ ఆన్‌లైన్‌లో అనేక యాప్‌లు చూస్తుంటాం. ఇటువంటి యాప్‌లు విశ్వసించేవి కావని, వాటితో యూజర్ల ఆర్థిక సంబంధ సమాచారం దుర్వినియోగమయ్యే అవకాశాలుంటాయని ప్రభుత్వం హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి గతేడాది 1062 ఫిర్యాదులు వచ్చినట్లు ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది. అటు గూగుల్ కూడా 2023 సెప్టెంబర్ నెలలో ఒకే వారంలో 134 ఫేక్ యాప్‌లను ప్లేస్టోర్ నుంచి తొలగించినట్లు అప్పట్లో ప్రకటించింది.



## భారీ వరదకు ఉప్పొంగి ప్రవహిస్తున్న గంగా

పర్యాటకులు ఘాట్‌ల వద్దకు వెళ్లొద్దని హెచ్చరిక
మరో మూడు రోజులు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు

ముందడుగు ఉత్తరాఖండ్:
ఉత్తరాఖండ్‌లో భారీగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు వచ్చి చేరడంతో గంగా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఆదివారం నాటికి నీటిమట్టం రిషికేశ్‌లోని త్రివేణి ఘాట్, గంగా హారతి ప్రాంతాల్లో ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. దీంతో రాత్రివేళల్లో ఘాట్‌ల వద్దకు పర్యాటకులెవరూ వెళ్లొద్దని రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన దళం హెచ్చరికలు జారీ చేసింది. ఉన్నతాధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు ఎస్పీ

మిగతా 2లో

## సర్వమతాలకు ప్రాధాన్యం ఇస్తాం

- జగన్నాథ రథయాత్ర ప్రారంభం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ముందడుగు హైదరాబాద్:
తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సర్వమతాలకు ప్రాధాన్యం ఇస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రను ఆయన ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

"సర్వమతాలకు ప్రాధాన్యం ఇస్తాం. అన్ని మతాలకు చెందిన భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించడం మా బాధ్యత. రాష్ట్రం శాంతి సౌఖ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ఈ యాత్ర ద్వారా



భగవంతుడిని కోరుకుంటున్నా. మానవ సేవే మాధవ సేవ అనే సూక్తితో మా ప్రభుత్వం పని చేస్తుంది. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో మార్పు వస్తుంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## కదిలిన జగన్నాథ రథచక్రాలు..

- అంబరాన్నంటిన భక్తుల జయ జయ ధ్వానాలు
- రథయాత్రకు హాజరైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- జనసంద్రంగా మారిన పూరీ పట్టణం



ముందడుగు ఒడిశా:
ఒడిశాలోని పూరీ జగన్నాథుని రథయాత్రకు దేశం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రథయాత్రను వీక్షించేందుకు భారీగా తరలిరావడంతో పూరీ పట్టణం జనసంద్రంగా మారింది. జగన్నాథ, బలభద్ర, సుభద్రలు

మిగతా 2లో

ముందడుగు
సోమవారం, 08-7-2024, హైదరాబాద్

# భారీ వరదకు ఉప్పొంగి ప్రవహిస్తున్న గంగా

ముందడుగు జాతీయం:
వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. మరోవైపు మరో మూడు రోజుల పాటు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షా లు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించింది. ప్రధానంగా కుమాన్, చమోలి, రుద్రప్రయాగ, పౌడీ జిల్లాల్లో అతి భారీ వర్షా లు కురిసే అవకాశముందని పేర్కొంది. మరోవైపు దెహ్రాదూన్, తెహ్రీ, హరిద్వార్, ఉత్తరకాశీ ప్రాంతాల్లోనూ భారీ వర్ష సూచనలున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరింది. మరోవైపు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి శనివారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

# తెలంగాణలో టిడిపికి పునర్వైభవం తెస్తా

- ఏపీ, తెలంగాణ తనకు రెండు కళ్లు
- పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు

ముందడుగు హైదరాబాద్:
తెలంగాణ గడ్డపై మళ్లీ టిడిపికి పునర్ వైభవం వస్తుందని ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణ తనకు రెండు కళ్లు అని వ్యాఖ్యానించారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు చంద్రబాబు తొలిసారి వచ్చారు. కార్యకర్తలు, నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. "ఆత్మీయులను కలిసి అభినందనలు తెలియజేయాలని వచ్చాను. మీ అభిమానం చూస్తుంటే నాకు ఉత్సాహం వస్తుంది. ఏపీలో



విజయానికి తెలంగాణ తెదేపా శ్రేణులు పరోక్షంగా కృషి చేశారు. వారందరికీ ధన్యవాదాలు. ఎన్టీఆర్ అనేక పరిపాలనా సంస్కరణలు తీసుకొచ్చారు. సంక్షేమానికి నాంది పలికిన నాయకుడు ఆయన. తెలంగాణలో అధికారంలో లేకున్నా కార్యకర్తలు పార్టీ వదల్లేదు. పార్టీ నుంచి నాయకులు తప్ప కార్యకర్తలు వెళ్లలేదు. తెలుగుజాతి ఉన్నంతవరకు తెదేపా జెండా రెపరెపలాడుతుంది. సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుని మళ్లీ అధికారంలోకి వచ్చాం. నన్ను జైల్లో పెట్టినపుడు తెదేపా శ్రేణులు చూపించిన చొరవ మరువలేను. ప్రపంచంలోని చాలా దేశాల్లో నా అరెస్ట్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. ఆ సమయంలో గచ్చిబౌలిలో నిర్వహించిన సభను నేను మరిచిపోలేను. హైదరాబాద్‌లో నాకు మద్దతుగా నిర్వహించిన ఆందోళనలను టీవీలో చూసి గర్వపడ్డా.

# డ్రగ్స్ కేసులో విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు

- 25 మంది డ్రగ్స్, గంజాయి తీసుకున్నట్లు వెల్లడి
- మణికొండలోని కేవ్ పబ్‌పై పోలీసుల విచారణ



ముందడుగు హైదరాబాద్:
మణికొండలోని కేవ్ పబ్‌లో పట్టుబడిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డీజే నిర్వాహకుడు ఆయూబ్‌తో పాటు మరో 24 మంది డ్రగ్స్, గంజాయి తీసుకున్నట్టు తేలిందన్నారు. మత్తు పదార్థాలు తీసుకున్నవారిలో ఎక్కువ మంది విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు ఉన్నారని వివరించారు. కేవ్ పబ్‌లో టీజీ న్యాబ్ అధికారులు, రాయదుర్గం ఎస్‌వోటీ పోలీసులు సోదాలు నిర్వహించి 55 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు వివరాలను మాదాపూర్ డీసీపీ వినిత్ మీడియా సమావేశంలో వెల్లడించారు. "పబ్‌లో ఎలక్ట్రానిక్ మ్యూజిక్ పార్టీ ఏర్పాటు చేసి డ్రగ్స్ సేకరించినట్టు గుర్తించాం. 25 మంది పైనా ఎన్‌డీపీఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశాం. బయట డ్రగ్స్ తీసుకొనే పబ్‌లోకి వచ్చారని విచారణలో తేలింది. సామాజిక మాధ్యమాల్లో ఎలక్ట్రానిక్ మ్యూజిక్ పార్టీ ఏర్పాటు చేశామని ప్రచారం చేశారు. పక్కా సమాచారం రావడంతో తెలంగాణ నార్కోటిక్, సైబరాబాద్, ఎస్వోటీ, రాయదుర్గం పోలీసులు సోదాలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలను ప్రోత్సహించినందుకు కేవ్ పబ్‌ను సీజ్ చేశాం. ఈ కేసులో పబ్ మేనేజర్ శేఖర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నాం. ఐటీ సంస్థలు వారి సిబ్బందికి డ్రగ్స్ తీసుకోవద్దని అవగాహన కల్పించాలి. త్వరలో మిగిలిన పబ్‌లలో కూడా సోదాలు చేస్తాం. గతంలో కూడా ఈ పబ్‌లో ఇలాంటి తరహా పార్టీలు జరిగాయనే అనుమానాలు ఉన్నాయి. పబ్ యజమానులు నలుగురు పరారీలో ఉన్నారు. వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తే మరింత సమాచారం వస్తుంది" అని డీసీపీ తెలిపారు.



# కదిలిన జగన్నాథ రథచక్రాలు..

ముందడుగు జాతీయం:
శ్రీక్షేత్రంలోని రత్నసింహాసనం వీడి యాత్రగా... పెంచిన తల్లి గుండిచాదేవి మందిరానికి చేరుకోనున్నారు. గర్భగుడిలోని దివ్య(దారు) విగ్రహాలు భక్త జనఘోష మధ్య రథాలపై మూడు కిలోమీటర్లు ప్రయాణించి అమ్మ సన్నిధికి చేరుకుంటాయి. ఈసారి రథయాత్రకు ప్రత్యేకత ఉంది. 1971 తర్వాత ఒకేరోజు జగన్నాథుని నవయవ్వన దర్శనం, నేత్రోత్సవం, రథయాత్ర నిర్వహిస్తున్నారు. మూడు వేడుకలు ఈరోజే ఉండడంతో జగన్నాథుని నందిఘోష్, బలభద్రుని తాళధ్వజ, సుభద్ర దర్పదళన్ రథాలు ఆదివారం సాయంత్రానికి అమ్మ ఆలయానికి చేరుకొనే పరిస్థితి లేదు. స్వామిసేవలు పూర్తయ్యే వరకు రథాలను మార్గమధ్యలో నిలిపివేస్తారు. మళ్లీ సోమవారం భక్తులు రథాలను లాగుతారు.

## రథయాత్రకు హాజరైన రాష్ట్రపతి ముర్ము..

పూరీ రథయాత్రకు గతంలో రాష్ట్రపతులెవరూ రాలేదు. తొలిసారి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. గవర్నర్ రఘుబర్‌దాస్‌తో కలిసి రాష్ట్రపతి.. సుభద్రమ్మ రథం లాగారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, కేంద్రమంత్రులు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. రెండురోజుల రథయాత్రలో 15 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. దీన్ని దృష్టిలో ఉంచుకొని పూరీ పట్టణానికి మూడంచెల భద్రత కల్పించారు.

# వార్తలు రాయించి అవినీతిపరుడిగా చిత్రీకరించారు

- ఉన్నతాధికారులు వేధింపులే కారణం
- 'సూసైడ్ చేసుకుంటున్నా' అని వాట్సాప్
- చికిత్స పొందుతూ అశ్వారావుపేట ఎస్ఐ మృతి

ముందడుగు హైదరాబాద్:
సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆస్పత్రిలో ఆదివారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ పురుగుల మందు తాగడం వల్ల రెండు కిడ్నీలు పూర్తిగా దెబ్బతిన్నాయని, డయాలసిస్ చేస్తున్నారని, లివర్ కూడా దెబ్బతిందని ఆయన బంధువులు తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసుకునే ముందు ఎస్సై తన మొబైల్‌నుంచి బంధువులకు, స్నేహితులకు ఓ మెసేజ్‌పంపించాడు. అందులో 'ఉన్నతాధికారులు వేధింపులు, సహచర సిబ్బంది చేసిన అవమానాలు తట్టుకోలేకే ఆత్మహత్య చేసుకుంటున్నా. ఆఖరి క్షణాన భార్యాబిడ్డలు గుర్తుకురావడంతో బతకాలి అనిపించి ఇప్పుడే108కి ఫోన్‌చేశా. నా ఫోన్‌లో అన్ని ఆధారాలున్నాయి.



నా రివాల్వర్‌ను పోలీస్ స్టేషన్‌లో సరెండర్ చేశా. పత్రికల్లో నాపై వార్తలు రాయించి అవినీతిపరుడిగా చిత్రీకరించారు. వేధింపుల గురించి డీఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదు. అందుకే సూసైడ్ చేసుకుంటున్నా' అని వాట్సాప్ చేశాడు. ప్రస్తుతం ఎస్ఐ ఫోన్ ఉన్నతాధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

ముందడుగు
సోమవారం, 08-7-2024, హైదరాబాద్

# భాగ్యనగరంలో మొదలైన బోనాల సందడి

- గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం
- పట్టు వస్త్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ

ముందడుగు హైదరాబాద్: భాగ్యనగరంలో ఆషాఢ మాసం బోనాల పండగ ఆదివారంనాడు వైభవంగా ప్రారంభమైంది. శివసత్తుల పూనకాలతో డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల హైదరాబాద్ నగరం మార్మోగుతోంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో బోనాల పండుగ నేడు ప్రారంభమైంది. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో గోల్కొండ కోటకు చేరుకున్నారు.



గోల్కొండలోని జగదాంబిక అమ్మవారి తొలిపూజకు ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం బంజారా దర్వాజ వైపు నుంచి నజర్ బోనంతో అమ్మవారి ఊరేగింపు గోల్కొండ కోటకు చేరుకుంది. ఆలయంలో అమ్మవారి ఘటాలను ఉంచిన తరువాత భక్తులు బోనాలు సమర్పించారు.

భక్తితో మట్టి కుండలో పరమాన్నం వండి, బోనాలు సిద్ధం చేసి ఆలయానికి తరలివస్తున్నారు. డిల్లెం బల్లెం పాటల మోతలతో శివసత్తుల పూనకాలు, పోతరాజు ఆటల మధ్య బోనాలు ఆలయానికి తరలివస్తుంటే గోల్కొండ కోటలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దశాబ్ది బోనాల పేరుతో పండగను అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులతో ఉత్సవాలు నిర్వహిస్తోంది. భక్తులకు అసౌకర్యం కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది.



# పెట్రోల్ బంకుల్లో పెట్రోల్‌కు బదులుగా నీళ్లు

## బంకు ఎదుట వాహనాదారులు ఆందోళన

ముందడుగు విజయవాడ: పెట్రోల్ బంకుల్లో మోసాలు జరుగుతూనే ఉంటాయి. కొన్ని చోట్ల పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ తక్కువగా రావడం, రీడింగ్‌లో మోసం, కొలతలో మోసం, నాణ్యత లేని ఇంధనం, ఎక్కువ డబ్బు తీసుకోవడం లాంటి మోసాలు ఇటీవల జరుగుతున్నాయి. ఇది కాకుండా మరికొన్ని చోట్ల పెట్రోల్‌కు బదులు నీళ్లు కూడా వస్తున్నాయి. తాజాగా విజయవాడలో చోటుచేసుకుంది. విజయవాడలోని అజిత్ సింగ్ నగర్‌పెట్రోల్ బంక్ లో వాహనదారులు పెట్రోలు పోసుకొని ఒక కిలోమీటర్ దూరం వెళ్లగానే వాహనాలు ఆగిపోతున్నాయి. ఎందుకు ఇలా జరిగిందో అని వాహనదారులు మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లగా.. పెట్రోల్‌లో నీరు కలిసిందని వారు చెప్పడంతో అంతా షాక్ అయ్యారు.

పెట్రోల్ బంకులో పెట్రోల్‌లో నీళ్ల కలపడం వల్ల వాహనాలు మొరాయించడంతో వాహనదారులు బంకు ఎదుట ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా.. కొంతమంది వాహనదారులు పెట్రోల్ బంక్ దగ్గరికి వాహనాలను తీసుకువచ్చి వారి వాహనాలలో నుండి పెట్రోల్ తీయించి మరి యాజమాన్యానికి చూపించారు. వర్షం నీళ్లు రావడంతో నీళ్లు కలిశాయని.. పొరపాటు జరిగిందని బంక్ యజమాని చెప్పారు. వాహనాల్లో పెట్రోల్ మొత్తం బయటికి తీసి మళ్లీ పెట్రోల్ కొట్టి ఇస్తానని బంక్ యజమాని చెప్పారు. వాహనదారులకు మరమ్మతులు చేసి ఇస్తానని హామీ ఇవ్వడంతో వాహన దారులు ఆందోళన విరమించారు.





# 995 కోట్ల పాస్‌వర్డ్‌లు లీక్

- ఒబామాకేర్ అనే హ్యాకర్ లీక్ చేశాడు
- ఇదే ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద లీక్

ముందడుగు క్రైం: ప్రస్తుత రోజుల్లో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి నెలకొంది. రోజురోజుకు సైబర్ సెక్యూరిటీ ముప్పు పెరుగుతోంది. కొన్ని కంపెనీల డేటా లీక్ అయినట్లు తరచుగా వార్తలు వస్తుంటాయి. ఇప్పటివరకు అతిపెద్ద డేటా లీక్ జరిగిందన్న సమాచారం వెలుగులోకి వచ్చింది. దాదాపు 995 కోట్ల పాస్‌వర్డ్‌లు లీక్ అయ్యాయి. ఈ పాస్‌వర్డ్ లీక్ ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద లీక్ అని నిపుణులు చెబుతున్నారు.

### నివేదికలో షాకింగ్ సమాచారం

ఒబామాకేర్ అనే హ్యాకర్ 995 కోట్ల పాస్‌వర్డ్‌లను లీక్ చేశాడు. గురువారం నాటి Rockyou2024 నివేదికలో ఈ సమాచారం వెలుగులోకి వచ్చింది. Rockyou2024 ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ఒకే స్థాయిలో ఉపయోగించే పాస్‌వర్డ్‌లు లీక్ అయినట్లు నివేదిక పేర్కొంది. లీక్ అయిన పాస్‌వర్డ్‌లలో చాలా మంది నటీనటుల వివరాలు కూడా ఉన్నాయని నివేదిక వెల్లడించింది.



### లాగిన్ సమాచారం కూడా లీక్

Rockyou2024 అనేక ఆన్‌లైన్ ఖాతాలకు అక్రమ యాక్సెస్ పొందిన తర్వాత చాలా మంది నటీనటుల పాస్‌వర్డ్‌లను పొందినట్లు చెప్పారు. చాలా మంది ఉద్యోగుల డేటా కూడా లీక్ అయింది. పాత, కొత్త డేటా లీక్‌ల సహాయంతో ఈ సమాచారం అందింది. ఈ మిశ్రమ డేటా లీక్‌తో పాటు, ఇమెయిల్ చిరునామాలు, అనేక లాగిన్ సమాచారం కూడా లీక్ అయ్యాయి. వ్యక్తుల గుర్తింపును దొంగిలించడానికి, ఆర్థిక నేరాలకు Rockyou2024 బాధ్యత వహిస్తుందని నివేదికలో పేర్కొంది. అయితే Rockyou2024 పాస్‌వర్డ్ లీక్ కావడం ఇదే తొలిసారి. ఇంతకు ముందు హ్యాకర్లు 8.4 బిలియన్ ప్లెయిన్ టెక్స్ట్ పాస్‌వర్డ్‌లను లీక్ చేశారని నివేదికలో పేర్కొన్నారు.



# చదువు చెప్పే గురువును చంపిన విద్యార్థి

## మార్కులు తక్కువొస్తున్నాయని హెచ్చరించాడు

ముందడుగు అస్సాం: కొన్ని సంఘటనలు చూస్తుంటే సమాజం ఏటు పోతుందో అర్థమే కావడం లేదు. మార్కులు తక్కువొస్తున్నాయని విద్యార్థిని మందలించినందుకు గురువును అత్యంత దారుణంగా చంపేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అస్సాంలోని శివసాగర్ జిల్లాలో శనివారం ఈ ఘటన జరిగింది. 11వ తరగతికి చెందిన ఓ విద్యార్థి కత్తితో తన కెమిస్ట్రీ ఉపాధ్యాయుడు రాజేశ్ బారువాను పొడవడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

కెమిస్ట్రీ బోధించటంతో పాటు రాజేశ్ స్కూల్ నిర్వహణ బాధ్యతలు కూడా చూస్తుండేవారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థికి తక్కువ మార్కులు రావటంతో రాజేశ్ అతన్ని మందలించాడు. తల్లిదండ్రులను తీసుకురమ్మని ఇంటికి పంపాడు. కొంత సమయం తర్వాత ఆ విద్యార్థి మామూలు దుస్తుల్లో క్లాస్‌కు తిరిగొచ్చాడు. గమనించిన ఉపాధ్యాయుడు వెంటనే ఇంటికి వెళ్లపోమని ఆదేశించాడు. దీంతో కోపోద్రిక్తుడైన విద్యార్థి.. అప్పటికే తన వద్ద ఉన్న కత్తితో రాజేశ్‌ను పలుమార్లు పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై ఆయన నెలకొరిగి విలవిల్లాడాడు. తోటి విద్యార్థుల సమాచారంతో అప్రమత్తమైన స్కూల్ యాజమాన్యం ఆయన్ని వెంటనే ఆస్పత్రికి తరలించింది. కానీ, అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు.

ముందడుగు
సోమవారం, 08-7-2024, హైదరాబాద్

# పేకాట రాయుళ్ల కోసం పోలీసులు కూలీల వేషం

## ఏడుగురుని అరెస్ట్ చేసి కేసు నమోదు



ముందడుగు రాజన్న సిరిసిల్ల:

పొలాల మధ్య పేకాట ఆడుతున్న పేకాట రాయుళ్లకు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ లో పోలీసులు దిమ్మతిరిగే ప్లాన్ వేశారు. పేకాట రాయుళ్లను పట్టుకునేందుకు పోలీసులు కూలీల వేషం వేశారు. పోలీసులకు ముస్తాబాద్ మండలంలోని బందనకల్ గ్రామ శివారు ప్రాంతంలో పంటపొలాల మధ్య పేకాటాడుతున్నారనే సమాచారం అందింది.. అయితే, పోలీస్ జీప్ రాగానే పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు కూలీలుగా మారి.. పేకాట స్థావరం దగ్గరికి వెళ్లారు.. వ్యవసాయ కూలీలుగా భావించి.. ఈ పేకాట రాయుళ్ళు దర్జాగా పేకాట ఆడుతున్నారు. కూలీలే కదా అని వారి దగ్గరకు వెళ్లే వరకు పేకాట ఆడుతున్న వారు పెద్దగా పట్టించుకోలేదు.. చివరకు వారు దగ్గరికి వెళ్లి చుట్టూ చేరారు.. అప్పుడు కూడా వాళ్లకు అర్థం కాలేదు.. చివరకు డ్రెస్ చూసి పేకాట రాయుళ్లు దెబ్బకు హడలెత్తిపోయారు.. అటు పారిపోలేక.. ఇటు ఏం చెప్పాలో అర్థం కాక నీళ్లు నములుతూ కవర్ చేసే ప్రయత్నం చేశారు. చివరకు పోలీసులు పేకాట ఆడుతున్న ఏడుగురుని అరెస్ట్ చేసి వారి దగ్గరి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పేకాట ఆడితే.. కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులుహెచ్చరించారు.

# బీర్, వైన్, విస్కీ బరువును ఎలా పెంచుతాయో తెలుసా...!

**చల్లటి బీరు తాగడం వల్ల పొట్ట దగ్గర కొవ్వు వేగంగా పేరుకుపోవడం ప్రారంభమవుతుందని చాలామంది అంటుంటారు. మొత్తానికి ఈ విషయంలో ఎంత వరకు నిజం ఉందో ఒకసారి తెలుసుకుందాం.**

ముందడుగు ప్రత్యేకం:

పొట్ట దగ్గర పేరుకుపోయిన కొవ్వు ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని క్లీవ్ ల్యాండ్ క్లినిక్ వైద్యుడు డాక్టర్ డేనియల్ అలెన్ చెబుతున్నారు. బీర్ బొడ్డు దాని చెత్త రూపం. పరిమిత పరిమాణంలో బీర్ తాగడం వల్ల పొట్ట దగ్గర కొవ్వు పెరుగుతుందని ఇప్పటివరకు ఎటువంటి పరిశోధనలు లేనప్పటికీ, బరువు పెరగడానికి బీర్, ఆల్కహాల్ కారణమని బలమైన ఆధారాలు కూడా ఉన్నాయి. అందువల్ల, శరీరాన్ని చల్లబరుస్తుంది అనే ప్రాతిపదికన బీర్ తీసుకోకండి. ఒక డబ్బా బీర్ 150 కేలరీల వరకు అందిస్తుంది. అదే సమయంలో మీరు మద్యం తాగినప్పుడు, అది ఆకలిని కూడా పెంచుతుంది. అందువల్ల మద్యం



లేదా బీర్ తాగిన తర్వాత తినాలని ఎక్కువగా అనిపిస్తుంది.

### పొట్ట కొవ్వుకు ఇదే కారణం

ఆల్కహాల్ తాగినప్పుడు అది కొవ్వును కరిగించే మీ శరీర సామర్థ్యాన్ని అడ్డుకుంటుంది. మీ కాలేయం ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులను జీవక్రియ చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది, అయితే ఆల్కహాల్, ఈ విషయాలను జీవక్రియ చేసే ఎంపికను అందించినప్పుడు కాలేయం కొవ్వును జీవక్రియ చేయడంలో ఆసక్తి చూపదు. బదులుగా ఆల్కహాల్‌ను జీవక్రియ చేయడం ప్రారంభిస్తుంది. కాబట్టి పొట్ట దగ్గర కొవ్వు పేరుకుపోవడం మొదలవుతుంది. అందువల్ల రెండు పరిస్థితులలో అదనపు బీర్ లేదా ఆల్కహాల్ హానికరం. అయితే బెల్లీ ఫ్యాట్‌కి కారణం ఏమిటో తెలుసుకోవడం ముఖ్యం.

### ప్రాసెస్ చేసిన ఆహారం

అదనపు కేలరీలు బెల్లీ ఫ్యాట్‌కి కారణమవుతాయని డాక్టర్ అలెన్ వివరించారు. ఈ కేలరీలు ఏ రూపంలోనైనా రావచ్చు. అతిగా ఆల్కహాల్ తీసుకోవడం ద్వారా శరీరంలో క్యాలరీలు పేరుకుపోయినట్లే, తీపి పదార్థాలు, అతిగా తినడం, అనారోగ్య ఆహారం, ప్రాసెస్ చేసిన ఆహారం మొదలైనవి శరీరంలో అధిక కేలరీలకు కారణమవుతాయి. మీరు అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకుంటే, ఈ కేలరీలను ఖర్చు చేయడానికి కష్టపడకపోతే అది కొవ్వుగా మారుతుంది. బొడ్డు కొవ్వుకు కారణమయ్యే అంశం ఇదే.

### తక్కువ తాగితే బెటర్

కడుపులో పేరుకుపోయిన కొవ్వును తొలగించడానికి ముందుగా అధిక కేలరీలు ఉన్న వస్తువులను నియంత్రించండి. కేలరీలను బర్న్ చేయడానికి, కష్టపడి పని చేయండి, ఎక్కువ వ్యాయామం చేయండి. పచ్చి ఆకు కూరలు, తాజా పండ్లను ఎక్కువగా తీసుకోవాలి. మీరు వైన్ లేదా బీర్ తాగితే..చాలా తక్కువ తాగండి.

# డొక్కా సీతమ్మ క్యాంటీన్లు పెట్టడం అభినందనీయం

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు

ముందడుగు అమలాపురం:

2018న డొక్కా సీతమ్మ స్ఫూర్తితో ఆమెను స్మరించుకుంటూ "మీరు నేను కలుద్దాం అన్నార్తులకు ఆకలి తీరుద్దాం" అనే నినాదంతో సేవా కార్యక్రమం చేపట్టడం జరిగిందని కోనసీమ ఆహార నిధి వ్యవస్థాపకుడు వీరంశెట్టి సతీష్, డొక్కా కామేశ్వరరావు అన్నారు. పి.గన్నవరం అక్విడెక్ట్ వద్ద డొక్కా సీతమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కోనసీమ అహారనిధి సభ్యులు అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామంలో కోనసీమ ఆహారనిధి తరపున ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపారు. వీరంశెట్టి సతీష్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లతోపాటు, డొక్కా సీతమ్మ క్యాంటీన్లు కూడా ఉంటాయని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాచుర్యం కల్పిస్తామని అనడం చాలా సంతోషంగా




ఉందన్నారు. లంకల గన్నవరంలో ఉన్న డొక్కా సీతమ్మ ఇంటిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ మంత్రి కందులు దుర్గేష్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆహారనిధి సభ్యులు గట్టెం వీరు, బండారు సురేష్, పోలిశెట్టి పవన్ మహేష్, రంకిరెడ్డి పండు, చీకట్ల కిరణ్, ఆర్కే నాయుడు, రంకిరెడ్డి బ్రహ్మాజీ, రంకిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో 8వ స్టోర్ తెరిచిన నేషనల్ మార్ట్

ముందడుగు మేడ్చల్:

నేషనల్ మార్ట్ - ఇండియా కా హైపర్ మార్ట్ వారి కొత్త స్టోర్ ఇప్పుడు జాతీయ రహదారి-44 లోని దివాన్ ఫంక్షన్ హాల్ కు ఆనుకొని ఉన్న మేడ్చల్ వినియోగదారులకు సేవలు అందించడానికి ప్రారంభమైంది. ఈ స్టోర్ 40,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో, విశాలమైన పార్కింగ్ స్థలంతో విస్తరించి ఉంది. మేడ్చల్ లోని నేషనల్ మార్ట్ కిరాణా, పానీయాలు, వ్యక్తిగత సంరక్షణ, స్టేషనరీ, హోమ్ & కిచెన్ అప్లయెన్సెస్, కుక్ వేర్, పాదరక్షలు, దుస్తులు, ఇంకా మరెన్నో ఉత్పత్తులను సరసమైన ధరలకు ఒకే చోట అందిస్తుంది.




ఈ సందర్భంగా నేషనల్ మార్ట్ వ్యవస్థాపకుడు యశ్ అగర్వాల్ నాణ్యత, సరసమైన ధరలతో కూడిన నేషనల్ మార్ట్ ను ఈ ప్రాంతానికి అందుబాటులోకి తీసుకొచ్చినందుకు తన హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, "మా వినియోగదారుల వైవిధ్యమైన అవసరాలన్నింటినీ తీర్చేందుకు ఎలాంటి ఇబ్బంది లేని షాపింగ్ అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం. ఈ సరికొత్త స్టోర్‌తో మేం కేవలం అంచనాలను అందుకోవడమే కాదు.. దాటుతాం కూడా. వినియోగదారులు తమకు కావల్సిన అన్నింటినీ ఒకేచోట, అదీ సరమైన ధరలకు పొందగలరు" అన్నారు.

ముందడుగు
సోమవారం, 08-7-2024, హైదరాబాద్



# మీ విజన్‌కు ధన్యవాదాలు.. పార్ట్ 2 కోసం వెయిటింగ్..

## ప్రభాస్ కల్కి 2898 ఏడీపై మృణాళ్ ఠాకూర్

గ్లోబల్ స్టార్ ప్రభాస్‌తోపాటు స్టార్ యాక్టర్లు మెరిసిన సైన్స్ ఫిక్షన్ జోనర్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఏడీ. నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేశాడు.జూన్ 27 (గురువారం) ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ డే నుంచి కలెక్షన్ల విషయంలో టాక్ ఆఫ్ ది గ్లోబల్ ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఇప్పటికే ఈ సినిమాపై మూవీ లవర్స్‌తోపాటు సెలబ్రిటీలు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో వన్ ఆఫ్ ది కీ రోల్ పోషించిన మృణాళ్ ఠాకూర్ సినిమాపై తన స్పందనను షేర్ చేసుకుంది. కల్కి 2898 ఏడీ విజువల్స్ మైండ్ బ్లోయింగ్‌గా ఉన్నాయి. టీం అంతా అద్భుతంగా పనిచేశారు. నటీనటులు, సంగీతం, వీఎఫ్ఎక్స్, కాస్ట్యూమ్స్.. ఇలా ప్రతీ ఒక్కటి అద్భుతంగా కుదిరాయి. నాగ్ అశ్విన్ ఈ మాస్టర్ పీస్‌ను అందించిన మీ విజన్‌కు ధన్యవాదాలు. అమితాబ్ బచ్చన్ సార్ మీనే నిజంగా షాహెన్‌షా. అశ్వత్థామగా మీ పాత్ర అసాధారణమైనది. మీరు ప్రతీ సన్నివేశంలో కమాండ్ చేసిన విధానం నన్ను ఇంకా అబ్బురపరుస్తూనే ఉంది. కమల్ హాసన్ సార్ మీ యాక్టింగ్ నమ్మశక్యం కాని విధంగా ఉంది. పార్ట్ 2 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని ట్వీట్ చేసింది. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర కీలక పాత్రలు పోషించారు. బెంగాలీ నటుడు శాశ్వత ఛటర్జీ విలన్‌గా నటించాడు.



# ప్రభాస్ ఏది అడిగినా చేసిపెట్టాలన్నదే నా కోరిక..

## మనసులో మాట బయటపెట్టిన పాయల్ రాజ్‌పుత్

వెండితెర మేఘమైతే.. దానిపై మెరిసిన మెరుపు తీగ పాయల్ రాజ్‌పుత్. 'ఆర్ఎక్స్ 100'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి కుర్రాళ్ల గుండెల్లో గుబులు రేపింది. మొదటి చిత్రంతో హాట్ బ్యూటీగా గుర్తింపు పొందిన ఆమె వరుస అవకాశాలతో దూసుకుపోయింది. కానీ, కొందరు పనిగట్టుకొని తనను తప్పుదోవ పట్టించడంతో మోసపోయానని చెబుతున్నది పాయల్. ఇటీవల 'మంగళవారం' హిట్‌తో మళ్లీ లైమ్‌లైట్‌లోకి వచ్చిన ఈ నటి తాజాగా 'రక్షణ' సినిమాతో మరోసారి ప్రేక్షకులకు అందాల విందు చేయనుంది. హిట్ హీరోయిన్‌గా పేరొచ్చినా.. కెరీర్‌లో ఎత్తుపల్లాలు ఎదుర్కొన్న ఈ హాట్ హీరోయిన్ పంచుకున్న కబుర్లు ఇవి.. కథ డిమాండ్ చేస్తే బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. 'ఆర్ఎక్స్ 100' కథలో భాగంగానే శృంగార సన్నివేశాలు ఉన్నాయి. కానీ, కథలో లేకున్నా.. అనవసరంగా అలాంటి సన్నివేశాలు జొప్పిస్తే మాత్రం ఒప్పుకోను.

కెరీర్ మొదట్లో పంజాబీ టెలీ సీరియల్స్, సినిమాల్లో నటించాను. మరాఠీలో ఘనవిజయం సాధించిన 'సైరత్' చిత్రం పంజాబీ రీమేక్ నాకు మంచి గుర్తింపునిచ్చింది. ఆ చిత్రంలో నా నటనకు ఫిలింఫేర్ అవార్డు లభించింది. ఇక టాలీవుడ్‌లో 'ఆర్ఎక్స్ 100' సాధించిన సక్సెస్ నాకు వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది.

ఇలియానా, అనుష్కశెట్టి అంటే ఇష్టం. పవన్‌కళ్యాణ్ చిత్రాలు ఎక్కువగా చూస్తాను. అవకాశం వస్తే మహేశ్‌బాబు, ప్రభాస్ సినిమాల్లో చేయాలని ఉంది. ప్రభాస్ నా ఫేవరెట్. ఆయనకు లంచ్ ఏర్పాటు చేయాలనుకుంటున్నా. తను ఏది అడిగితే అది చేసిపెట్టాలని నా కోరిక. రాజ్మా రైస్ నాకు నాకు చాలా ఇష్టం. దాన్ని నేనే స్పెషల్‌గా వండి నా చేత్తో ప్రభాస్‌కు తినిపించాలని ఉంది. అలాంటి చాన్స్ వస్తే మాత్రం అస్సలు వదులుకోను.

నేను ఎలాంటి పాత్రలు పోషించాలన్నది ప్రధానం కాదు. స్క్రిప్టులో బలం ఉండాలి. కథ లేకుండా, ఎలాంటి పాత్ర చేసినా ఫలితం శూన్యమే. ముందుగా కథ, నా పాత్ర నచ్చాలి. డైరెక్టర్ మంచివాడై ఉండాలి. అలాంటి సినిమాలే ఒప్పుకొంటాను. బలమైన కథతో రూపొందే హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాల్లో నటించాలని ఉంది. కథ నచ్చితే రెమ్యునరేషన్ గురించి పెద్దగా పట్టించుకోను.

నేను ఏ పనిచేసినా 200 శాతం ఎఫర్ట్స్ పెడతాను. అయితే ఒక్కోసారి మనం ఆశించిన ఫలితం రాకపోవచ్చు. అది డెస్టినీ అనుకుంటాను. 'ఆర్ఎక్స్ 100' సక్సెస్‌ను నేను సద్వినియోగం చేసుకోలేదనే చెప్పాలి. ఆ టైమ్‌లో చాలామంది నన్ను మిస్‌లీడ్ చేశారు. ఇప్పుడు తత్వం బోధపడింది. ఎక్కడికి వెళ్లాలి, ఎక్కడికి వెళ్లకూడదు, ఏం చేయాలి, ఏం చేయకూడదు లాంటి విషయాలు తెలిసొచ్చాయి. ఇప్పుడు ఏదైనా ప్రాజెక్టు ఓకే చేయడానికి ముందు ఇవన్నీ ఆలోచిస్తాను. నా జాగ్రత్తలో నేనుంటాను.